ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY
కుమరం భీం జిల్లా వార్తలు
6
గురువారం 11 జనవరి 2024



విద్యార్థుల అభ్యసన సామర్థ్యాలను పెంచాలి: డీఈవో

ఆసిఫాబాద్, జనవరి 10: విద్యార్థుల అభ్యసన సామర్థ్యాలు పెంచాలని డీఈవో అశోక్ అన్నారు. బుధవారం మండలంలోని గుండి మండల ప్రాథమిక పాఠశాలను ఆయన తనిఖీచేశారు. ఈ సందర్భంగా అల్పాహారం పథకాన్ని పరిశీలించారు. విద్యార్థుల ఫేస్‌రికగ్నైజింగ్ సిస్టంను కూడా పరిశీలించారు. విద్యార్థులను ప్రశ్నలు అడిగి వారి విద్యాస్థాయిని పరీక్షించారు. ఈసందర్భంగా మాట్లాడుతూ వర్క్‌బుక్‌కు పాఠ్యపుస్తకాలకు మధ్య సమన్వయంఉండేలా బోధించాలని ఉపాధ్యాయులకు సూచించారు. ఆయనవెంట సమగ్ర శిక్ష కోఆర్డినేటర్ మధుకర్ తదితరులు ఉన్నారు.

సమన్వయంతో పనిచేసి అభివృద్ధి సాధించాలి

● మండల సమావేశంలో ఎమ్మెల్యే హరీష్‌బాబు



సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే పాల్వాయి హరీష్‌బాబు

దహెగాం, జనవరి 10: అధికారులు, ప్రజాప్రతినిధులు సమన్వయంతో పనిచేసి మండలఅభివృద్ధి సాధించాలని ఎమ్మెల్యే పాల్వాయిహరీష్‌బాబు అన్నారు. బుధవారం ఎంపీడీవో కార్యాలయంలో ఎంపీపీసులోచన అధ్యక్షతన మండల సర్వసభ్య సమావేశం నిర్వహించారు. ఈ సమావేశానికి ముఖ్యఅతిథిగా హాజరైన ఎమ్మెల్యే మాట్లాడుతూ అటవీశాఖ అధికారులు మారుమూలగ్రామాల ప్రజలతో సత్సంబంధాలు కలిగిఉంటేనే వన్యప్రాణుల మనుగడకు ప్రజలు సహకరిస్తారన్నారు. దేవాజీగూడెం పాఠశాల అద్దె భవనంలో కొనసాగుతుందని భవననిర్మాణ నిధుల మంజూరుకు ప్రతిపాదనలు పంపాలని ఎంఈవో భిక్షపతిని ఆదేశించారు. లగ్గాం, గెర్రెపాఠశాలల్లో విద్యార్థులసంఖ్య అధికంగా ఉన్నారని ఉపాధ్యాయులను డిప్యూటేషన్ ఇవ్వాలనిఎంఈవోను జడ్పీటీసీకోరారు. సమావేశంలో జడ్పీచైర్మన్‌కోనేరు కృష్ణ, కోఆప్షన్ సభ్యుడు సిద్ధికి,జడ్పీటీసీశ్రీరామరావు, ఎంపీడీవోరాజేశ్వర్‌గౌడ్ పాల్గొన్నారు.

పీఎం జన్‌మన్ పథకం ద్వారా గిరిజనుల అభివృద్ధి

జైనూర్, జనవరి 9: ప్రధానమంత్రి జన్‌మన్ పథకం ద్వారా గిరిజనుల అభివృద్ధికి కృషి చేస్తామని అదనపు కలెక్టర్ దీపక్ తివారి అన్నారు. బుధవారం మండలంలోని గౌరి కోలంగూడలో ఏర్పాటు చేసిన ప్రత్యేక కార్యక్రమంలో ఆయన లీడ్ డిస్ట్రిక్ట్ మేనేజర్‌తో కలిసి పాల్గొన్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ కేంద్రప్రభుత్వం జన జాతీయ ఆదివాసీ న్యాయ మహాఅభియాన్ పథకం ద్వారా బలహీన గిరిజన సమూహాలను ప్రధానస్రవంతిలోకి తీసుకురావడానికి ప్రత్యే కచర్యలు చేపడుతోందన్నారు. ఈ సందర్భంగా ప్రతి గిరిజనుడికి ఆధార్ కార్డు, కేసీసీ రుణాలు, అటల్ యోజన తదితర పథకాలు అందేలా చూస్తామన్నారు. పీవీటీజీ గిరిజనులకు ఆయుష్మాన్ భార త్‌కార్డులు, కిసాన్‌క్రెడిట్‌కార్డులు అందేలాచర్యలు తీసుకుంటా మన్నారు.

జిల్లా కవికి వికీపీడియా వార్షికోత్సవ ఆహ్వానం



ఆత్రం మోతీరాం

వాంకిడి, జనవరి 10: మండలంలోని నగర్‌గుట్ట గ్రామానికి చెందిన కవి, రచయిత ఆత్రం మోతీరాం తెలుగు వికీపీడియా 20వ వార్షికోత్సవానికి ఆహ్వానం అందుకున్నారు. ఈనెల 26నుంచి 28 వరకు విశాఖపట్నంలో జరిగే తెలుగు వికీపీడియా వార్షికోత్సవానికి రావాలని ఆహ్వానించారు. తెలుగువికీపీడియాలో వ్యాసాలురాయడం, కొలాం సంస్కృతికి సంబంధించిన ఛాయాచిత్రాలను పొందుపరచడం వంటి కృషికి ఆహ్వానం అందించినట్లు కవి, రచయిత ఆత్రం మోతీరాం తెలిపారు. బోలి చేతో ఫౌండేషన్ సీఈవో నేతి సాయికిరణ్, కొలాం సేవాసంఘం రాష్ట్ర అధ్యక్షుడు, ప్రధాన కార్యదర్శి ఆత్రం భీంరావు, వసంత్‌రావు ఈసందర్భంగా మోతీరాంను అభినందించారు.

'ఆట' క్యాలెండర్ ఆవిష్కరణ

కౌటాల, జనవరి 10: కౌటాల ఎంఆర్‌సీలో బుధవారం ఆదివాసీ టీచర్స్ అసోసియేషన్(ఆట) నూతన సంవత్సర క్యాలెండర్‌ను ఆవిష్కరించారు. కార్యక్రమంలో డీఈవో సోమయ్య, హెచ్‌ఎం హనుమంతు, పోచాని, అశోక్, తదితరులు పాల్గొన్నారు.

చిగురిస్తున్న ఆశలు



● డీఎస్సీ కోసం ఏళ్లుగా ఎదురుచూస్తున్న నిరుద్యోగులు
● మెగా డీఎస్సీపై సీఎం హామీ
● జిల్లాలో 289 ఖాళీలు

ఆసిఫాబాద్, జనవరి 10: ఉపాధ్యాయ ఖాళీపోస్టులు భర్తీ చేస్తామన్న ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ప్రకటనతో నిరుద్యోగుల్లో ఆశలు చిగురిస్తున్నాయి. ఇదివరకే విద్యాశాఖపై సీఎం సమీక్ష నిర్వహించి మూతపడిన బడులను తెరిపిస్తామని ప్రతిపంచాయతీలో ఖచ్చితంగా సర్కారు బడులు ఉండాలని అందుకు అనుగుణంగా ఖాళీగా ఉన్న ఉపాధ్యాయ పోస్టులన్నింటినీ భర్తీ చేస్తామని ప్రకటించారు. దీంతో జిల్లాలోని బీఈడీ, డీఈడీ పూర్తి చేసిన నిరుద్యోగుల్లో ఆశలు చిగురిస్తున్నాయి. ఆరేళ్లుగా నోటిఫికేషన్ లేక ఎదురుచూస్తున్న వారికి మెగా డీఎస్సీ ప్రకటన ఊరటనిచ్చింది. దీంతో అభ్యర్థులు మళ్లీ పుస్తకాలను తిరగేసే పనిలో పడ్డారు. ఎలాగైన ఈసారి జాబ్ చేజి క్కించుకోవాలనే పట్టుదలతో ఉన్నారు.

ఎన్నికల కారణంగా వాయిదా..

2017లో నిర్వహించిన టీఆర్టీ తర్వాత ఇప్పటివరకు ప్రభుత్వం డీఎస్సీ నిర్వహించలేదు. గత సెప్టెంబర్‌లో అప్పటి ప్రభుత్వం టీచర్ పోస్టులకు నోటిఫికేషన్ జారీచేసింది. నవంబరు20 నుంచి ఆన్‌లైన్‌లో పరీక్షలు జరగాల్సి ఉండగా ఎన్నికలు రావడంతో వాయిదా పడ్డాయి. కానీ ప్రస్తుత ప్రభుత్వం మెగాడీఎస్సీ ప్రకటన చేయడంతో అభ్యర్థులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికే వేలాది మంది అభ్యర్థులు టెట్ ఉత్తీర్ణత సాధించి డీఎస్సీ కోసం ఎదురుచూస్తున్నారు. జిల్లాలో చాలా పాఠశాలల్లో సింగిల్ టీచర్లతో కొనసాగిస్తున్నారు. ఉన్నత పాఠశాలల్లో డెప్యుటేషన్ ద్వారా సర్దుబాటు చేస్తూ బోధన కొనసాగిస్తున్నారు. గతంలో కొన్నిగ్రామాల్లో విద్యార్థులు తక్కువగా ఉం డడంతో విద్యార్థులను పక్కనున్న పాఠశాలలకు పంపించారు. సీఎం రేవంత్‌రెడ్డి బడిలేనిఊరు ఉండొద్దు, మూసివేసిన పాఠశాలలు తెరి పించాలి అని ఆదేశించడంతో జిల్లా టీచర్ పోస్టులు మరిన్ని పెరిగే అవకాశం ఉంది.

జిల్లాలో 289 టీచర్ పోస్టుల ఖాళీలు..

జిల్లాలో స్థానిక సంస్థల పరిధిలో 684ప్రభుత్వ పాఠశాలలున్నాయి. ఇందులో 535ప్రాథమికపాఠశాలలు కాగా, 98 ప్రాథమికోన్నత, 51 ఉన్నతపాఠశాలలు ఉన్నాయి. అన్ని కేటగిరీల్లో కలిపి 2,444 టీచర్ పోస్టులు ఉన్నాయి. ప్రస్తుతం 289 పోస్టులు ఖాళీగా ఉన్నట్లు అధికారిక గణంకాలు వెల్లడిస్తున్నాయి. అయితే ఉపాధ్యాయుల పదోన్నతులు, బదిలీలు చేస్తే ఎస్జీటీ నుంచి స్కూల్ అసిస్టెంట్‌కు పదోన్నతులు కల్పిస్తే మరిన్ని ఎస్జీటీ పోస్టులు పెరిగే అవకాశం ఉంది. దీంతో పాటు 317జీవో రద్దు చేస్తే పోస్టులు పెరుగుతాయి. వేరే జిల్లాల నుంచి కుంరంభీం జిల్లాకు అదనంగా 244మంది ఉపాధ్య యులు వచ్చి విధులు నిర్వహిస్తున్నారు. ప్రభుత్వం 317జీవో రద్దు చేస్తే పోస్టులు పెరిగే అవకాశాలు ఉన్నాయి. జిల్లాలో ప్రస్తుతం 289 పోస్టులు ఖాళీగా ఉండగా అందులో స్కూల్ అసిస్టెంట్ 49,ఎస్జీటీ 214 లాంగ్వేజ్ పండిట్ 24, పీఈటీ2 పోస్టులున్నాయి.జిల్లాలో టీచర్ పోస్టుల కోసం సుమారు 5800 మంది ఎదురుచూస్తున్నారు.



ప్రభుత్వ పాఠశాలలోని తరగతి గది

నోటిఫికేషన్ విడుదల చేయాలి..

గందే క్రాంతికుమార్, బీఈడీ అభ్యర్థి, ఆసిఫాబాద్



ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి మెగా డీఎస్సీ ప్రకటనతో ఉపాధ్యాయ పోస్టుల కోసం సన్నద్ధమవుతున్న నిరుద్యోగుల్లో ఆశలు చిగురిస్తున్నాయి. వెంటనే డీఎస్సీ నోటిఫికేషన్ విడుదల చేయాలి. ఖాళీగా ఉన్న ఉపాధ్యాయ పోస్టులను భర్తీ చేయాలి.

విద్యతో పాటు ఆరోగ్యానికి ప్రాధాన్యమివ్వాలి

● ఎమ్మెల్యే కోవ లక్ష్మి

ఆసిఫాబాద్, జనవరి 10: విద్యతోపాటు ఆరోగ్యానికి ప్రాధాన్యతనివ్వాలని ఎమ్మెల్యే కోవ లక్ష్మి అన్నారు. బుధవారం కేజీబీవీ పాఠశాలలో బేటీ బచావో- బేటీపడావో కార్యక్రమంలో భాగంగా నిర్వహించిన మెగావైద్యశిబిరానికి ఆమె ముఖ్య అతి థిగా హాజరై ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ వైద్యశిబిరం విద్యార్థులఆరోగ్య స్థితిని తెలుసుకోవడానికి దోహదం చేస్తుందన్నారు. అదనపుకలెక్టర్ దీపక్ తివారి మాట్లాడుతూ విద్యార్థినులను పౌష్టికఆహారం గురించి అడిగితెలుసుకు న్నారు. కార్యక్రమంలో జడ్పీఈసీ నాగేశ్వర్‌రావు, డీఈ వో అశోక్, డిప్యూటీ డీఎంహెచ్‌వో సుధాకర్ నాయక్, సహకారచైర్మన్ అలీబీన్ అహ్మద్, జిల్లా సైన్స్ అధికారి మధుకర్,ఎంపీడీవోశశికళ పాల్గొన్నారు.

కెరమెరి: మండలంలోని మోడి కేజీబీవీ పాఠశాలలో బుధవారం జిల్లా విద్యాశాఖ, వైద్యఆరోగ్య శాఖల ఆధ్వర్యంలో బేటీ బచావో- బేటి పడావో కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా పాఠశాల విద్యార్థినుల కోసం పలురకాల వైద్యపరీక్షలు నిర్వహించారు. కార్యక్రమంలో ఎస్‌వో మీనాకుమారి, హెచ్ ఎం స్వర్ణలత, డాక్టర్ సునంద, తదితరులు పాల్గొన్నారు.

జైనూర్: మండలంలోని పోచం లోద్ది కేజీబీవీ పాఠశాలలో బుధవారం వైద్యశిబిరం నిర్వహించారు. ఈ సంద ర్భంగా 70విద్యార్థినులకు ఆరోగ్యపరీ క్షలు నిర్వహించామని సూపర్‌వైజర్ దిలీప్‌కుమార్ తెలిపారు. జర్వాలతో బాధపడుతున్న వారికి పరీక్షలు నిర్వహించి మందులు పంపిణీ చేశామన్నారు.

వాంకిడి: ఆడపిల్లలు విద్యపై ఎక్కువ దృష్టి సారించాలని ఎంపీపీ ముండే విమలాబాయి అన్నారు. బుధవారం ఆమె మండల కేంద్రంలోని కేజీబీవీ పాఠశాలలో బేటీ బచావో బేటీ పడావో కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ విద్యార్థినులు చదువుతోపాటు ఆరోగ్యంపై శ్రద్ధ వహించాలన్నారు. ఈ సందర్భంగా ఆర్‌బీఎస్‌కే వైద్యాధికారి నరేందర్ ఆధ్వర్యంలో విద్యార్థులకు వైద్యపరీక్షలు నిర్వహించి మందులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో కేజీబీవీ ఎస్‌వో పద్మ, హెచ్ ఈవో రవిదాస్, ఏఎస్ఎం జీవిత, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.



వైద్యశిబిరాన్ని పరిశీలిస్తున్న ఎమ్మెల్యే కోవ లక్ష్మి



ఫైనల్స్‌లో ముగ్గులు వేస్తున్న పోటీదారులు



సినీనటి అనన్యతో సెల్ఫీ దిగుతున్న యువతులు, మహిళలు



ప్రథమ స్థానంలో నిలిచిన ముగ్గు వద్ద మహిళలు

ముగ్గుల హరివిల్లు

ఉత్సాహంగా 'ఆంధ్రజ్యోతి-ఏబీఎన్' ముత్యాల ముగ్గుల పోటీ ఫైనల్



ముగ్గు వేస్తున్న పాలకుర్తి ఎమ్మెల్యే యశస్విని



ముగ్గు వేస్తున్న కాంగ్రెస్ నేత ఝాన్సీరెడ్డి



ముగ్గులను పరిశీలిస్తున్న అతిథులు



ఆంధ్రజ్యోతి-ఏబీఎన్ నిర్వహిస్తున్న కెనరాబ్యాంక్ ముత్యాల ముగ్గుల పోటీలు (పవర్డ్ బై ఎయిమ్స్ విద్యాసంస్థలు, బెంగళూరు.. రియల్ పార్టనర్: స్వర్గసీమ సుకేతన) ఆధ్వర్యంలో బుధవారం హైదరాబాద్‌లో జరిగిన ఫైనల్స్‌లో పోటీదారులు వేసిన ముగ్గులతో ఇంద్రధనస్సు నేలకు దిగి వచ్చిందా అనిపించింది. తెలంగాణవ్యాప్తంగా 45 కేంద్రాల్లో పోటీలు జరగగా, ఉమ్మడి జిల్లా నుంచి ఒకరు ఫైనల్స్‌లో తమ ముగ్గులతో పోటీ పడ్డారు. సినీనటి అనన్య నాగళ్ల, పాలకుర్తి ఎమ్మెల్యే మామిడాల యశస్వినితో పాటు కాంగ్రెస్ నేత ఝాన్సీరెడ్డి తదితరులు పాల్గొన్నారు.



సినీనటి అనన్య




ముగ్గులు వేస్తున్న మహిళలు





అతిథులకు స్వాగతం పలుకుతున్న ఆంధ్రజ్యోతి నెట్‌వర్క్ ఇన్‌చార్జి కృష్ణప్రసాద్, స్టేట్ బ్యూరో చీఫ్ ఉప్పులూరి మురళీకృష్ణ







తాళ్ళపేటలో చోరీ

దండేపల్లి, జనవరి 10 : తాళ్ళపేట గ్రామానికిచెందిన ఎండి దావుద్‌ఖాన్ ఇంట్లో మంగళవారం అర్ధరాత్రి సమయంలో చోరీ జరిగింది. ఇంట్లో బీరువాలో ఉన్న రెండుతులాల బంగారం, 35తులాల వెండి ఆభరణాలను దొంగిలించారు. దావుద్‌ఖాన్ మంగళవారం రాత్రి 9గంటలకు కుటుంబసభ్యులతో కలిసి భోజనం చేసి పడుకున్నారు. ఇంటివెనుక తలుపులు తీసి ఇంట్లోకి ప్రవేశించారు. బీరువా తలుపులు తీసి అందులో ఉన్న రెండుతులాల బంగారు ఆభరణాలు, 35 తులాల వెండి అభరణాలు అపహరించారు. బుధవారం తెల్లవారుజామున నిద్ర లేచి చూసేసరికి బీరువా తెరిచి ఉండటంతో వెంటనే పోలీసులకు సమాచారం అందించారు. ఎస్సై ప్రసాద్ సంఘటన స్థలానికి చేరుకొని పరిశీలించారు. క్లూస్‌టీమ్ పోలీసులుఆధారాలను సేకరించారు. దావుద్‌ఖాన్ ఫిర్యాదుమేరకు కేసుదర్యాప్తు జరుపుతున్నట్లు వెల్లడించారు.

చోరీకి విఫలయత్నం

హాజీపూర్, జనవరి 10: ముల్కల్ల గ్రామంలోని రెండు ఇండ్లలో మంగళవారం అర్ధరాత్రి గుర్తుతెలియని దొంగలు చోరీకి విఫలయత్నం చేశారు. ఇండ్ల చుట్టు ఉన్న తలుపులకు గొల్లాలు వేసి ప్రధాన ద్వారంతలుపును డ్రిల్లింగ్‌మిషన్‌తో కట్‌చేయడానికి ప్రయత్నిస్తుండగా శబ్దానికి ఇండ్లలోని వారు లేచి కేకలు వేయడంతో దొంగలు పారిపోయారు. సమాచారం అందుకున్న పోలీసులు బుధవారం ఉదయం బాధితుల ఇండ్లను పరిశీలించి వివరాలు సేకరించారు.

రైల్వే ఆస్తి దొంగతనం కేసులో

ఆరుగురి అరెస్టు

అంతర్గాం, జనవరి 10: విధుల్లో ఉన్న రైల్వే ఉద్యోగిని బెదిరించి రైల్వే ఆస్తిని దొంగిలించిన కేసులో బుధవారం ఆరుగురిని అరెస్టు చేసినట్టు రామ గుండం రైల్వే ప్రొటెక్షన్స్ ఫోర్స్(ఆర్‌పీఎఫ్) సీఐ బుర్ర సురేష్‌గౌడ్ తెలిపారు. డిసెంబరు 14న విలేజి అంతర్గాం శివారు గోదావరి రైల్వే బ్రిడ్జి వద్ద ట్రాక్ మెన్‌గా విధులు నిర్వహిస్తున్న పవన్ కుమార్‌ను మంచిర్యాలకు చెందిన కడమంచి మహేష్, కడమంచి శ్రీను, చింతల శేఖర్, వనరాశి మల్లేష్, ఇగ్గన నగేష్, వనరాశి ఉప్పలయ్యలు బెదిరించి మెటీరియల్‌ను దొంగిలించారు. నిం దితులను అదుపులోకి తీసుకుని మెటీరియల్‌ను స్వాధీనం చేసుకున్నారు. నిందితులను కాజీపేట రైల్వే కోర్టులో హాజరుపర్చనున్నట్టు సీఐ పేర్కొన్నారు. రైల్వే ఆస్తులను దొంగిలించినా, ఉద్యోగుల విధులకు ఆటంకం కలిగిం చినా కఠిన చర్యలు తీసుకోనున్నట్టు ఆర్‌పీఎఫ్ సీఐ బుర్ర సురేష్‌గౌడ్ తెలిపారు. ఆర్‌పీఎఫ్ ఏఎస్‌ఐ శేఖర్‌రెడ్డి, సిబ్బంది పాల్గొన్నారు.

రాజ్‌గూడ శివారు హత్య కేసును చేధించిన పోలీసులు

● మంత్రాల నెపంతోనే హత్య

తిర్యాణి, జనవరి 10: మండలంలోని మాణిక్యాపూర్ గ్రామ పంచాయతీలోని రాజ్‌గూడ శివారులో గత శనివారం జరిగిన హత్యా కేసును పోలీసులు చేధించారు. ఈ మేరకు తిర్యాణి పోలీసు స్టేషన్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో నిందితులను ప్రవేశపెట్టిన సీఐ అల్లం నరేందర్ వివరాలు వెల్లడించారు. ఈ నెల 5న మృతుడు తిరుపతి తన పంట చేనులో కావలికి వెళ్లగా పథకం ప్రకారం అయిదుగురు వ్యక్తులు హత్యచేశారని తెలిపారు. మాణిక్యాపూర్‌లోని రాజ్‌గూడలో తిరుపతి కొన్నిరోజులుగా గ్రామం లోని వారితో సఖ్యతగాఉండడం లేదు. ఇదే తరుణంలో నిందితుల్లోని నాగేష్ తండ్రి మారుతి ఆ గ్రామానికి పటేల్‌గా వ్యవహరిస్తున్నాడు. మారుతికి కొన్ని రోజులుగా ఆరోగ్యం బాగలేదు. దీంతో తిరుపతే మారుతికి మంత్రాలు చేస్తున్నాడన్న నెపంతో నిందితుడు నాగేష్ తన బంధువులైన జుగునక హీరమన్, చిక్రం మారుతి, హర్షవర్ధన్, ఆత్రం చిన్ను సహాయంతో తిరుపతిని హత్య చేశారు. నిందితులు ఉపయోగించిన గొడ్డలితోపాటు హత్య చేసేటప్పుడు ఉపయోగించిన టార్చ్‌లైట్, మృతుడి మొబైల్‌ఫోన్‌తో పాటు మరో మొబైల్ ఫోనును స్వాధీనపర్చుకొని నిందితులను రిమాండ్‌కు పంపిస్తున్నట్లు సీఐ తెలిపారు. హత్య కేసును త్వరితగతిన చేధించిన తిర్యాణి ఎస్సై రమేష్‌తోపాటు పోలీసు సిబ్బందిని సీఐ అభినందించారు.

డాక్టర్ మధు అకాల మృతి

కాగజ్‌నగర్, జనవరి 10: కాగజ్‌నగర్ పట్టణానికి చెందిన డాక్టర్ మధు బుధవారం అకాలమరణం చెందారు. కొన్ని సంవత్సరాలుగా అనారోగ్యంతో బాధపడుతున్న ఆయన హైదరాబాద్‌లో చికిత్స పొందుతున్నారు. ఈ క్రమంలో బుధవారం తుదిశ్వాస విడిచారు. సాయంత్రం హైదరాబాద్‌లోని జూబ్లీహిల్స్‌లో అంతక్రియలు నిర్వహిం చారు. బుధవారం రాత్రి కాగజ్‌నగర్‌వాసులు పట్టణంలో కొవ్వొత్తుల ర్యాలీ నిర్వహించి నివాళులు అర్పించారు. పాతికేళ్లక్రితం ఉద్యోగరిత్యా కాగజ్‌నగర్ ఈఎస్‌ఐలో డాక్టర్‌గా చేరారు. ఈ ప్రాంతవాసుల కోసం ప్రత్యేకమైన వైద్యసేవలు అందిం చేందుకు ప్రైవేటు ప్రాక్టీసు చేపట్టి మంచిపేరు తెచ్చుకున్నారు.



రోడ్డు ప్రమాదంలో తాపీ మేస్త్రీ మృతి


అంజనేయులు (ఫైల్)

మందమర్రిటౌన్, జనవరి 10: పట్టణంలోని జాతీయ రహదారి జయశంకర్ చౌరస్తా వద్ద బుధవారం బైక్‌ను లారీ ఢీకొన్న సంఘటనలో దీపక్‌నగర్‌కు చెందిన కంచాల ఆంజ నేయులు (43) అక్కడికక్కడే మృతి చెందాడు. బైక్‌పై యాపల్ వైపు వెళ్తుండగా బెల్లంపల్లి వైపు వెళ్తున్న లారీ ఆంజనేయులు బైక్‌ను ఢీకొట్టింది. దీంతో ఆంజనే యులు లారీ టైరు కింద పడి శరీర భాగాలు చెల్లా చెదురయ్యాయి. ఎస్‌ఐ చంద్రకుమార్ సంఘటన స్థలానికి చేరుకుని వివరాలు సేకరించారు. మృతదేహాన్ని మంచి ర్యాల ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. లారీని పోలీస్ స్టేషన్‌కు తరలించామని, డ్రైవర్ పరారైనట్లు ఎస్‌ఐ తెలి పారు. మృతుడికి భార్య, ఇద్దరు కుమారులు, కుమార్తె ఉ న్నారు. దీపక్‌నగర్‌లో విషాదం నెలకొంది.

అక్రమంగా రాయి తరలిస్తున్న ట్రాక్టర్ పట్టివేత

కాసిపేట, జనవరి 10: రొట్టెపల్లి అటవీ శివారు ప్రాం తం నుంచి అక్రమంగా బండరాయిని తరలిస్తుండగా బుధవారం ప్రజలు అడ్డుకున్నారు. అధికారులకు తెలిపినా పట్టించుకోలేదన్నారు. అందుకే తాము ట్రాక్టర్‌ను అడ్డుకు న్నామని తెలిపారు. ట్రాక్టర్‌ను రెవెన్యూ అధికారులకు అ ప్పగించారు. అక్రమంగా తరలిస్తే చర్యలు తీసుకుంటా మని తహసీల్దార్ భోజన్న హెచ్చరించి వదిలేశారు.

సాయిభార్గవ్‌కు నివాళి

ఏసీసీ, జనవరి 10: అమెరికాలో గుండెపోటుతో మృతిచెందిన నరెడ్ల సాయిభార్గవ్ భౌతిక కాయానికి బుధ వారం అంత్యక్రియలు నిర్వహించారు. ఈ నెల 2న అమె రికాలో గుండెపోటుతో మృతిచెందగా బుధవారం ఆయన భౌతికకాయం మంచిర్యాలకు చేరుకుంది. సాయిభార్గవ్ భౌతిక కాయాన్ని సందర్శించి నివాళులర్పించారు.

బంజారా కాలనీలో వైద్య శిబిరం

భీమారం, జనవరి 10: బంజారా కాలనీలో బుధవారం భీమారం, జైపూర్ ఉమ్మడి మండ లాల ఆరోగ్య అధికారి డాక్టర్ అనిల్ వైద్య శిబిరం నిర్వహించారు. 55 మందికి వైద్య పరీక్ష లు నిర్వహించి మందులు అందజేశారు. 10 మంది రక్తనమూనాలను సేకరించారు. ఆయన మాట్లాడుతూ పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని సూచించారు. నీరు నిల్వ ఉం డకుండా చూడాలన్నారు. కాలనీలో రెండు రోజుల క్రితం జ్వరంతో ఒకరు మృతి చెందాడని, దీన్ని దృష్టిలో ఉంచుకుని పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవడంతో పాటు జ్వరంగా ఉంటే ఆసుపత్రికి రావాలని సూచించారు. ఏఎన్ఎం ఉమారాణి, ఆశా వర్కర్లు పాల్గొన్నారు.

విద్యార్థులకు స్కూలు బ్యాగులు పంపిణీ

జైపూర్, జనవరి 10 : మంచిర్యాలకు చెందిన మాధవ సేవా సమితి చారిటబుల్ ట్రస్టు సభ్యులు మంగళవారం మిట్టపల్లి ప్రాథమికోన్నత పాఠశాలలోని విద్యార్థులకు స్కూలు బ్యాగులు, నోటు పుస్తకాలు, పెన్నులు, పెన్సిళ్లు అందజేశారు. ఆరోగ్య పరీక్షలు చేయడానికి రెండు పల్స్ మీటర్లు, ఒక థర్మామీటర్, రెండు పీపీఎఫ్ కిట్‌లు అందించారు. ప్రధానోపాధ్యాయుడు విశ్వప్రసాద్, ట్రస్టు కోశాధికారి రేవెల్లి బాపూజీ, సభ్యులు కిరణ్, శ్రీనివాస్, మహేందర్, ఉపాధ్యాయులు సునీత, రమాదేవి, సునీత తదితరులు పాల్గొన్నారు.

తహసీల్దార్ ఎదుట రౌడీషీటర్ బైండోవర్

దండేపల్లి, జనవరి 10: వెల్గనూర్ గ్రామానికి చెందిన రౌడీషీటర్ కొప్పుల శ్రీనివాస్‌ను బుధవారం తహసీల్దార్ సంధ్యారాణి ఎదుట బైండోవర్ చేసినట్లు ఎస్సై ప్రసాద్ పేర్కొన్నారు. దసరా పండుగ రోజున పలువురిపై దాడికి పాల్పడినందుకు కేసు నమోదు చేశారు. అతనిపై పలు కేసులు ఉన్నందున తహసీల్దార్ ఎదుట బైండోవర్ చేశారు.

బెల్లంపల్లి: గంజాయి కేసుల్లో నిందితులుగా ఉన్న ఇద్దరిని బుధవారం బైండోవర్ చేసినట్లు టూ టౌన్ పోలీసులు తెలిపారు. బెల్లంపల్లికి చెందిన బాల్మీకి అమర్‌దీప్, ఆకెనపల్లికి చెందిన బుడిమె నవీన్‌లను బైండోవర్ చేసి టూ టౌన్‌పోలీస్‌స్టేషన్‌లో అప్పగించినట్లు తెలిపారు.

కోడి పందేలు నిర్వహిస్తే కఠిన చర్యలు

కోటపల్లి/వేమనపల్లి, జనవరి 10 : సంక్రాంతి పండగ సందర్భంగా చెన్నూరు రూరల్ సర్కిల్ పరిధిలో కోడి పందేలు ఆడితే కఠిన చర్యలు తీసుకుంటామని రూరల్ సీఐ విద్యా సాగర్ అన్నారు. బుధవారం కోటపల్లి, నీల్వాయి మండలాలకు చెందిన కోడి పందేల నిందితులకు కౌన్సెలింగ్ నిర్వహించారు. కోడి పందేలు, జూదం వంటి వ్యసనాలు జీవితాన్ని నాశనం చేస్తాయని, చట్టవిరుద్ధ కార్యక్రమాలు చేస్తే సహించేది లేదన్నారు. రెండు మం డలాలకు చెందిన 9 మందిని బైండోవర్ చేసినట్లు తెలిపారు. ఎస్‌ఐ సురేష్ పాల్గొన్నారు.

ఘనంగా భీమదేవర జెండా పండుగ

నెన్నెల, జనవరి 10: : మైలారంలో ఆదివాసి మన్నెవార్లు భీమదేవర జెం డా పండుగను బుధవారం జరుపుకున్నారు. మన్నెవార్ (కోలంవార్)లను ఆదివాసి గిరిజన తెగగా ప్రభుత్వం గుర్తించిన సందర్భంగా ఆత్మగౌరవ వారోత్సవాలు జరుపుకుంటున్నట్టు ఆదివాసీ నాయకులు చెప్పారు. జంబి శ్రీనివాస్ జెండాను ఆవిష్కరించారు. డప్పు దరువుల మధ్య ఊరేగింపుగా వెళ్లి తమ కులదేవతలైన భీమన్న, మారెమ్మ, పోశమ్మలకు పూజలు నిర్వహించారు. నాయకులు ఆస్టి బానయ్య, పోల్క బానయ్య, జంపం గట్టయ్య తదితరులు పాల్గొన్నారు.

బేటీ పడావో- బేటీ బచావో పథకాన్ని సద్వినియోగం చేసుకోవాలి


మాట్లాడుతున్న ఎమ్మెల్యే పాల్వాయి హరీష్‌బాబు

దహెగాం, జనవరి 10: కేంద్ర ప్రభుత్వం అంది స్తున్న బేటీ పడావో- బచావో పథకాన్ని ప్రజలు, విద్యార్థినులు సద్వినియోగం చేసుకో వాలని ఎమ్మెల్యే పాల్వాయి హరీష్‌బాబు అన్నారు. బుధవారం మండలకేంద్రంలోని కేజీ బీవీలో మెగా వైద్యశిబిరాన్ని కలెక్టర్‌హేమంత్ బోర్కడే, జిల్లా వైద్యాధికారి తుకారాంబట్‌తో కలసి ప్రారంభించారు. వసతిగృహాలలో ఉం టూ చదివే బాలికలు ఆరోగ్యంపై దృష్టి సారిం చాలన్నారు. కలెక్టర్ మాట్లాడుతూ ఆరోగ్యమే మహాభాగ్యమన్నారు. అల్పాహారంతోపాటు భోజనం చేసే సమయంలో సమయపాలన పాటించాలన్నారు. డీఎంహెచ్‌వో మాట్లా డుతూ జిల్లాలో 15కేజీబీవీల్లో పదివైద్యబృందా లతో వైద్యచికిత్స అందిస్తున్నామన్నారు. కార్యక్ర మంలో డిప్యూటీ డీఎంహెచ్‌వో సీతారాం, తహసీల్దార్ కవిత, ఎంఈవో భిక్షపతి, ఎంపీ డీవో రాజేశ్వర్‌పాల్గొన్నారు.

కేజీబీవీల్లో మెగా హెల్త్ చెకప్..

బెజ్జూరు: మండలకేంద్రంలోని కస్తూర్బా పాఠశాలలో విద్యార్థులకు మెగా హెల్త్‌చెకప్ నిర్వహించారు. ప్రభుత్వం విద్యార్థులఆరోగ్యం పైప్రభుత్వం ప్రత్యేకదృష్టి సారిస్తోందని డాక్ట ర్‌సుజాత అన్నారు. అనంతరం పిల్లల్లోఉన్న లోపాలను గుర్తించితగు పోషకాలు అందిస్తా మని ఎస్‌వోఅరుణ తెలిపారు. కార్యక్రమంలో ఎంపీటీసీ సుల్తానా, సిబ్బంది పాల్గొన్నారు.

చింతలమానేపల్లి: మండలకేంద్రంలోని కస్తూర్బా పాఠశాలలో డాక్టర్ రామకృష్ణ మెగా హెల్త్‌చెకప్ నిర్వహించి 50మందివిద్యార్థుల రక్తనమునాలుసేకరించారు. కార్యక్రమంలో ఎంపీపీ నానయ్య, ఎంపీడీవో సుధాకర్‌రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

కాగజ్‌నగర్: కాగజ్‌నగర్ కస్తూర్బా పాఠశా లలో డాక్టర్‌శ్రీకాంత్ మాట్లాడుతూ విద్యార్థుల కు నాలుగు రకాల పరీక్షలు నిర్వహిస్తున్నట్టు తెలిపారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయు రాలు అనురాధ, స్పెషల్ అధికారిని రమాదేవి, సిబ్బంది పాల్గొన్నారు.

మరో పులి కోసం కొనసాగుతున్న అన్వేషణ

● సీసీ ఫుటేజీకిచిక్కిన చనిపోయిన ఆవును తిన్న మూడు పులులు

● ఇప్పటికే మృతిచెందిన రెండు పులులు


దరిగాం అడవిలో అటవీ శాఖ సిబ్బంది

కాగజ్‌నగర్, జనవరి 10: కాగ జ్‌నగర్ మండలం దరిగాం అటవీ ప్రాంతంలో రెండు పులులు మృత్యువాత పడిన సంఘటనలో రాష్ట్ర అటవీ అధికారులు, ఎన్టీ సీఏ(నేషనల్ టైగర్ కన్జర్వేషన్ అథారిటి) సభ్యులు రంగంలోకి దిగి మిగితా పులుల ఆచూకీ కో సం అన్వేషణ ప్రారంభించారు. ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాలోని ట్రాకర్స్, ఎఫ్ఎస్‌వో, ఎఫ్‌బీవోలతో పాటు ఎఫ్‌డీవో, డీఎఫ్‌వో, సిబ్బంది రాత్రినుంచి దరిగాం అడవిలోనే మకాం వేశారు. ఆవు మాంసం తిన్న వాటిలో శనివారం ఒక పులి, సోమ వారం మరొక పులి చనిపోగా, మిగిలిన పులి బతికుందా..? లేక చనిపోయిందా..? అనే కోణంలో అడవిని జల్లెడ పడుతు న్నారు. విష ఆహారం తింటే తాగునీరు ఎంతో అవసరం ఉంటుంది, ఇందుకు అటవీ ప్రాంతంలో తాగునీటి జాడల వ ద్ద అటవీ సిబ్బంది ముమ్మరంగా గాలి స్తున్నారు. దరిగాం, రేగుల గూడ, సిర్పూ రు(టి),మహారాష్ట్ర ప్రాంతాలో అమ ర్చిన సీసీ కెమెరాల ఫుటేజీలను సేక రించి పరిశీలిస్తున్నారు. ఆవును తిన్న పులి ఎంత దూరం వెళ్లినట్టు అంచనా వేస్తున్నారు. పోలీసుశాఖ కూడా రంగం లోకిదిగి మృత్యువాతపడిన పులి స్థలం లో ఉన్న ఆవు ఎవరిది.? అనే కోణంలో వివరాలు సేకరిస్తున్నారు. అదేవిధంగా పదిహేను రోజుల నుంచి అనుమానాస్ప దంగా ఎవరైనా తిరిగారా..? తదితర అం శాలపై విచారణ చేస్తున్నారు. ప్రస్తుతం జరుగుతున్న సెర్చ్ ఆపరేషన్‌పై ఎఫ్‌డీవో వేణుబాబును సంప్రదించగా మంగళ వారం రాత్రి నుంచి మిగితా పులుల కోసం అన్వేషిస్తున్నామన్నారు. ఇప్పటి వరకు ఎలాంటి అప్‌డేట్ రాలేదన్నారు.

నేడు హైమన్‌డార్ఫ్ దంపతుల 37వ వర్ధంతి

జైనూర్, జనవరి 10: మానవ ఎరిణామ శాస్త్రవేత్త ప్రొఫెసర్ హైమన్ డార్ఫ్, ఆయన సతీమణిని ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా ఆదివాసులు ఎన్నటికీ మరచిపోలేరు. డార్ఫ్ దంపతుల జ్ఞాప కాలు వారుచేసిన సేవలు ఆదివాసుల గుండెల్లో చిరస్థాయిగా నిలిచిపోయాయి. ఇంగ్లాండ్ దేశంలో పుట్టిపెరిగిన డార్ఫ్‌దంపతులు ఉమ్మడి ఆదిలా బాద్ జిల్లా ఆదివాసులకు ఎనలేని సేవలం దించారు. వారి కృషిఫలితంగా నేడు గిరిజనులకు సర్వహక్కులు దక్కుతు న్నాయనడంలో సందేహంలేదు. మార్ల వాయి ఆదివాసులు ప్రతి సంవత్సరం మాదిరిగానే ఈఏడాది జనవరి11న డార్ఫ్ దంపతుల వర్ధంతిని పెద్ద ఎత్తున నిర్వహించేందుకు పూర్తి ఏర్పాటు చేశారు.

పత్తి కొనుగోళ్లు బంద్

ఆసిఫాబాద్, జనవరి 10: ఆసిఫాబాద్ మార్కెట్‌కమిటీ పరిధిలోని ఆసిఫాబాద్, వాంకిడి, కొండపల్లి సీసీఐ పత్తి కొనుగోలు కేంద్రాలలో పత్తినిలువలు అధికంగా ఉండడం తో స్థలంకొరత కారణంగా పత్తి కొనుగోళ్లను నేటినుంచి నిలిపివేస్తున్నట్లు సంబంధిత కేంద్రాల సీపీవో తెలిపారు. పునఃప్రారంభ తేదీని తెలియజేస్తామన్నారు. అంతవరకు ఎవరుకూడా పత్తినిజిన్నింగ్ మిల్లులకు తీసుకు రావద్దన్నారు.

దృశ్యశ్రవణ కేంద్రంగా సిర్పూర్(టి) రైతువేదిక ఎంపిక

సిర్పూర్(టి), జనవరి 10: సాగుకు సాంకేతిక సహకా రంతో రైతులకు సలహాలు, సూచనలు అందించేందుకు రైతువేదికలు ఉపయోగపడే లక్ష్యంతో ప్రభుత్వం జిలా లోని ఒకేఒక రైతువేదికను సిర్పూర్(టి) మండలకేంద్రం నుంచి ఎంపిక చేసింది. ఈ మేరకు బుధవారం బీఎస్ఎ న్ఎల్ అధికారులు దృశ్యశ్రవణ పరికరాలను (ఇంట ర్నెట్) కనెక్షన్‌ను ఏర్పాటుచేశారు.

సంక్షిప్త సమాచారం..

ఆసిఫాబాద్: ఆసిఫాబాద్ పోలీసుహెడ్‌క్వార్టర్స్‌లో రిజ ర్వుఇన్‌స్పెక్టర్‌గా విధులు నిర్వహిస్తున్న రమేష్ బదిలీపై వెళ్తున్న సందర్భంగా బుధవారం ఎస్పీసురేష్‌కుమార్ ఆయనను ఘనంగా సన్మానించారు.

-హైదరాబాద్‌లోని ఇందిరాపార్కు వద్ద టీఎమ్మార్పీఎస్ ఆధ్వర్యంలో ఫిబ్రవరి 29న నిర్వహించే పోరు గర్జనను విజయవంతం చేయాలని ఆ సంఘం జిల్లా అధ్యక్షుడు రవి కోరారు. బుధవారం పోస్టర్లను విడుదల చేశారు.

-బీజేపీ ప్రభుత్వం తీసుకువచ్చిన న్యాయసంహిత చట్టాన్ని వెంటనే ఉపసంహరించుకోవాలని, లేనిపక్షంలో ఉద్యమాన్ని ఉధృతం చేస్తామని ఏఐటీయూసీ జిల్లా అధ్య క్షుడుదివాకర్ అన్నారు. బుధవారంఏఐటీయూసీ ఆధ్వర్యం లో ఆర్టీసీ ప్రైవేటు డ్రైవర్లు డిపోఆవరణలో సమ్మె చేశారు.

-రైతులఅభివృద్ధికి ప్రభుత్వం సహకరించాలని రైతు సంఘం జిల్లాఅధ్యక్షుడు వైరగాడే మారుతి పటేల్ కోరారు. బుధవారం కలెక్టర్ హేమంత్‌కు రైతుసంఘం ఆధ్వర్యం లో పలుసమస్యలపై వినతిపత్రం అందజేశారు. ఈ సంద ర్భంగా మాట్లాడుతూ జిల్లాలో ఏర్పాటుచేసే కృషివిజ్ఞాన కేంద్రానికి 50ఎకరాలు కేటాయించాల కోరారు.

వాంకిడి: క్రీడలు స్నేహసంబంధాలను పెంపొందిం చేందుకు దోహదపడతాయని ఖమాన సర్పంచు పెందుర్ పవన్ పేర్కొన్నారు. ఖమానలోని లింబరావుగూడలో జై నిర్వహిస్తున్న కబడ్డీ పోటీలను ఆయన ప్రారంభించారు.

బెజ్జూరు: మండలంలోని ఎల్కపల్లిలో పీపీరావు స్మారకక్రికెట్‌పోటీలు నిర్వహించడం అభినందనీయమని ఎస్సైవిక్రం అన్నారు. బుధవారం పోటీలను ప్రారంభిం చిన అనంతరం ఆయన మాట్లాడుతూ గ్రామీణ ప్రాంత యువత క్రీడల్లో రాణించాలన్నారు.

-మండలకేంద్రానికి చెందిన సెండోకోటేశ్వర్ అనారో గ్యంతో ఇటీవల మృతిచెందగా మృతుడి కుటుంబాన్ని బుధవారం బీజేపీ నాయకులు సందర్శించి ఆర్థికసాయం అందజేశారు.

-పీఆర్టీయూ మండలకార్యవర్గంను బుధవారం ఎన్ను కున్నారు. గౌరవఅధ్యక్షురాలిగా అరుణ, మండలాధ్యక్షుడు గా మహేష్, ప్రధానకార్యదర్శిగా లక్ష్మణ్, ఉపాధ్యక్షులుగా రాజేశ్వర్, రవీంద్ర, లావణ్య ఉపాధ్యక్షురాలిగా అనిత, కార్యదర్శులుగా లావణ్య, నాగమణి, దేవకిషన్, కార్యదర్శి గాప్రియాంక, మీడియా కన్వీనర్‌గా రవిని ఎన్నుకున్నట్లు పరిశీలకులు శ్యాంసుందర్, తిరుపతి తెలిపారు.

రెబ్బెన: గంగాపూర్ జాతరను పురస్కరించుకొని బుధవారం రోడ్డు మార్గాన్ని కలెక్టర్ హేమంత్ బోర్కడే, డీసీసీ అధ్యక్షుడు కొక్కిరాల విశ్వప్రసాద్ పరిశీలించారు. ప్రతి సంవత్సరం మాఘశుద్ధ పౌర్ణమి నుంచి మూడు రోజులపాటు గంగాపూర్ జాతర జరుగుతుంది.

కాగజ్‌నగర్: కాగజ్‌నగర్ మార్కెట్‌యార్డులో బుధ వారం ఎమ్మెల్యే హరీష్‌బాబు కంప్యూటర్ కాంటాను ప్రారంభించారు.

-కాగజ్‌నగర్ లారీ అసోసియేషన్ నూతన కార్యవర్గా నికి బుధవారం ఎన్నికలు జరుగగా అధ్యక్షుడిగా వెన్న కిషోర్‌బాబు, కార్యదర్శిగా నిజాం ఎన్నికయ్యారు.

పెంచికలపేట: మండలంలోని కొండపల్లి గ్రామా నికి చెందిన ఎల్కరి శేఖర్ ఇంట్లో స్థానిక పోలీసులు, టాస్క్‌ఫోర్స్ పోలీసులు సంయుక్తంగా తనిఖీచేయగా మూడు క్వింటాళ్ల రేషన్‌బియ్యం లభ్యమయ్యాయి. బియ్యంను పోలీసుస్టేషన్‌కు తరలించి శేఖర్‌పై కేసు నమోదు చేసినట్లు పోలీసులు తెలిపారు.



భక్తులకు మెరుగైన సౌకర్యాలు కల్పించాలి

మందమర్రిటౌన్, జనవరి 10: మందమర్రిలోని పాలవాగు ఒడ్డున నిర్వహించే సమ్మక్కసారలమ్మ జాతరకు మెరుగైన సౌకర్యా లు కల్పించాలని మందమర్రి జీఎం మనోహర్ తెలిపారు. బుధ వారం జీఎం కార్యాలయంలోని తనచాంబర్‌లో అధికారులతో జాత రపై సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ జాతర ఫిబ్రవరి 21నుంచి 24వరకు జరుగుతుందన్నారు. నాలుగు రోజుల పాటు భక్తులకు సౌకర్యాలు కల్పించాలన్నారు. డిపార్టుమెంట్ల వారు పరస్పరం సహకరించుకుంటూ జాతరను విజయవంతం చేయాల న్నారు. కార్యక్రమంలో ఎస్‌వోటూజీఎం రాజేశ్వర్‌రెడ్డి,పీఎం శ్యాంసుం దర్, గుర్తింపు సంఘం నాయకులు, అధికారులు పాల్గొన్నారు.

రక్షణతో కూడిన ఉత్పత్తిపై దృష్టిసారించాలి

రామకృష్ణాపూర్, జనవరి 10: సింగరేణిలో కార్మికులు రక్షణతో కూడిన ఉత్పత్తి సాధించడం కోసం ప్రతికార్మికుడు కృషిచేయాల్సిన అవసరం ఉందని రామకృష్ణాపూర్ సీఎస్పీ డీజీఎం బాలాజీ భగ వతి ఝా అన్నారు. బుధవారం కార్మికులకు ప్రమోషన్ పత్రాలను అందించే కార్యక్రమంలో బాగంగా మాట్లాడారు. రక్షణతో కూడిన ఉత్పత్తి సంస్థ ప్రధాన లక్ష్యమని తెలిపారు. అనంతరం కార్మికులకు పత్రాలను అందించారు. కార్యక్రమంలో ఎస్ఈ చంద్రమౌళీ, గుర్తిం పుసంఘం ఫిట్ కార్యదర్శి హరిరామ కృష్ణ, ఏఐటీయూసీ బ్రాంచి సెక్రటరీ అంజనేయులు తదితరులు పాల్గొన్నారు.

సీఎండీని కలిసిన మాజీ ఎమ్మెల్యే

మందమర్రిటౌన్, జనవరి 10: సింగరేణి సీఎండీగా బాధ్యతలు స్వీకరించినడైరెక్టర్ ఫైనాన్స్‌అండ్‌పా బలారంను బుధవారం మాజీ ప్రభుత్వవిప్ నల్లాల ఓదెలు హైదరాబాద్‌లో మర్యాద పూర్వకంగా కలిసి సన్మానించారు. కార్మికులసంక్షేమానికి కృషిచేయాలని కోరారు.

భూసేకరణ సమావేశానికి హాజరైన జీఎంలు

మందమర్రిటౌన్, జనవరి 10: మంచిర్యాల కలెక్టరేట్‌లో బుధ వారం సింగరేణిలోని ఆర్‌అండ్‌ఆర్ భూసేకరణ సమస్యలపై నిర్వ హించిన సమావేశంలో మందమర్రి జీఎం మనోహర్, శ్రీరాంపూర్ జీఎం సంజీవరెడ్డి, బెల్లం పల్లి జీఎంలు పాల్గొన్నారు. అదనపు కలెక్టర్ మోతీలాల్ మాట్లాడుతూ సింగరేణి ప్రాంతాల్లో పెండింగ్‌లో ఉన్న ఆర్‌అండ్‌ఆర్ భూసేకరణ సమస్యలను త్వరగాపరిష్క రించా లని సూచించారు. ఎస్టేట్ అధికారులు, తహసీల్దార్‌లు పాల్గొన్నారు.

రక్షణ సూత్రాలు తప్పక పాటించాలి

శ్రీరాంపూర్, జనవరి 10: ఉద్యోగులు రక్షణ సూత్రాలు తప్పక పాటించాలని బెల్లంపల్లి రీజియన్‌జీఎం(రక్షణ)కె హరినారాయణ గుప్తా అన్నారు. బుధవారం ఆర్కేన్యూ టెక్ గనిఆవరణలో నిర్వ హించిన రక్షణ అవగాహన సదస్సుకు ఆయన ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. ఉద్యోగులంతా రక్షణ సూత్రాలపై అవగాహన కలిగి ఉంటే గనుల్లో జరిగే ప్రమాదాలను నివారించవచ్చన్నారు. కార్యక్రమంలో గ్రూప్‌ఏజెంట్ మాలోత్ రాముడు, గని మేనేజర్ స్వామిరాజు, రక్షణాధికారి కొట్టె రమేష్, తదితరులు పాల్గొన్నారు.

సైబర్ మోసాలపై అప్రమత్తంగా ఉండాలి


అవగాహన కల్పిస్తున్న ఈడీ బసివిరెడ్డి, ఐటీ కార్పొరేట్ డీజీఎం శ్రీనివాసరావు

జైపూర్, జనవరి 10: ఎస్టీపీపీ అధికారులు, ఉద్యోగులు సైబర్ మోసాలకు గురి కాకుండా అప్రమత్తంగా ఉండాలని ఎస్టీపీపీ ఈడీ బసివిరెడ్డి సూచిం చారు. బుధవారం జైపూర్‌లోని ఎస్టీపీపీ కాన్ఫరెన్స్ హాలులో సైబర్‌మోసాల పట్ల తీసుకోవాల్సిన జాగ్రత్తల గురించి అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తెలియని వ్యక్తులకు బ్యాంకు ఖాతా, ఏటీఎం పిన్, ఓటీపీ నెంబర్లు చెప్పవద్దన్నారు. అనంతర ఐటీకార్పొరేట్ డీజీఎం శ్రీనివాసరావు మాట్లాడుతూ సైబర్‌మోసాలను అరిక ట్టడం కోసం మినిస్ట్రీ ఆఫ్‌కోల్, మినిస్ట్రీ ఆఫ్‌హోం అఫైర్స్ నుంచి వచ్చిన ఆదేశా మేరకు జాతీయ సైబర్‌సెక్యూరిటీపై అవగాహన కల్పిస్తున్నామని తెలిపారు. అనంతరం పవర్ ప్రజం టేషన్ ద్వారా ఉద్యోగులకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో అధికారులు శ్రీనివాసులు, ప్రసాద్, సుధాకర్, మధుసూదన్‌రెడ్డి, రామాశాస్త్రి పాల్గొన్నారు.

పదోన్నతులతో పెరగనున్న వేతనాలు

మందమర్రిటౌన్, జనవరి 10: పదోన్నతుల ద్వారా వేతనాలు పెరుగుతాయ ని,పదోన్నతులు పొందిన ప్రతి ఒక్కరు సంస్థ అభివృద్ధికి కృషి చేయాలని జీఎం మనోహర్ తెలిపారు. బుధవారం జీఎం కార్యాలయంలో పనిచేస్తున్న సిబ్బందికి సర్వీసు లింక్డ్ పదోన్నతిపత్రాలను అందజేశారు. సింగరేణిలో మంచి వేతనాలు ఉన్నాయని, కష్టపడి పనిచేయాలని సూచించారు. కార్యక్రమంలో ఎస్‌వోటూ జీఎం రాజేశ్వర్‌రెడ్డి,పర్సనల్ మేనేజర్ శ్యాంసుందర్ పాల్గొన్నారు.

● పదోన్నతుల ద్వారా ప్రతి ఒక్కరికి వేతనాలు పెరుగుతాయని కేకే 5గని మేనేజర్ భూశంకరయ్య, వర్క్‌షాప్ ఎస్ఈ నాగరాజునాయక్ పేర్కొన్నారు. బుధవారం ఏరియాలోని కేకే5గనితోపాటు వర్క్‌షాపులో పలువురు కార్మికు లకు పదోన్నతిపత్రాలను పంపిణీచేశారు. కార్యక్రమంలోసలేంద్ర సత్యనారా యణ, భీమనాధుని సుధర్శన్, గనిరక్షనాధికారి రమేష్ తదితరులు పాల్గొన్నారు.

కాసిపేట: కాసిపేట గనిలోని ఉద్యోగులకు సర్వీసు లింక్డ్ ప్రమోషన్ ద్వారా 29మందికి పదోన్నతి పత్రాలను గనిమేనేజర్ అల్లావుద్దీన్ గనిపై బుధవారం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రమోషన్‌పొందిన ఉద్యో గులు క్రమశిక్షణతో వృత్తినైపుణ్యాన్ని పెంపొందించు కుని రక్షణతో పనిచేయా లన్నారు. కార్యక్రమంలో ఏఐటీయూసీ బెల్లంపల్లి బ్రాంచిఇన్‌చార్జీ చిప్ప నర్స య్య, కార్యదర్శి దాగం మల్లేష్, పిట్‌కార్యదర్శి మీనుగు లక్ష్మీనారాయణ తదితరులు పాల్గొన్నారు.

రమేష్ మృతికి సంతాపం

మందమర్రిటౌన్, జనవరి 10: ఏరియాలోని కాసిపేట2 గనిలో విధి నిర్వహణలో మృతిచెందిన మచ్చ రమేష్ మృతికి బుధవారం ఏరియాలోని కేకే5 గని అధికారులు, కార్మికులు సంతాపం తెలిపారు. రెండు నిమి షాలు మౌనం పాటించారు. ఈ సందర్భంగా కేకే5గని మేనేజర్ భూశంకరయ్య, రక్షణా ధికారి రమేష్ మాట్లాడుతూ రమేష్ మృతి కుటుంబానికే కాకుండా సంస్థకు కూడా తీరనిలోటని పేర్కొన్నారు. కార్యక్రమంలో ఏఐటీయూసీ బ్రాంచి కార్యదర్శి సలేంద్ర సత్యనారాయణ, గని అధికారులు, కార్మికులు పాల్గొన్నారు.

ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY
మంచిర్యాల జిల్లా వార్తలు
3
గురువారం 11 జనవరి 2024



ఆన్‌లైన్ నమోదును పకడ్బందీగా చేపట్టాలి

జైపూర్, జనవరి 10: ప్రజాపాలనలో ఐదు గ్యారంటీ పథకాలకు ప్రజలు అందించిన దరఖాస్తు ఫారాల్లో పొందుపర్చిన సమాచారాన్ని ఆన్‌లైన్‌లో నమోదు చేయాలని అదనపు కలెక్టర్ రాహుల్‌అన్నారు. బుధవారం తహసీల్దార్, ఎంపీడీవో కార్యాలయాల్లో కొనసాగుతున్న ఆన్‌లైన్ వివరాల నమోదు ప్రక్రియను పరిశీలించారు. ఆయన మాట్లాడుతూ ఈ నెల 17లోగా ఆన్‌లైన్ నమోదు ప్రక్రియను పూర్తి చేయాలన్నారు. తప్పుడు లేకుండా నమోదు చేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో సత్యనారాయణ, అధికారులు పాల్గొన్నారు.

అవిశ్వాసం దిశగా మున్సిపాలిటీలు



కలెక్టర్ సంతోష్‌కు నోటీసు అందజేస్తున్న కాంగ్రెస్ కౌన్సిలర్లు (ఫైల్)

- నేడు మంచిర్యాల, రేపు నస్పూర్, బెల్లంపల్లి సమావేశాలు
- ముందస్తుగా క్యాంప్‌నకు కౌన్సిలర్లు
- మంచిర్యాల మున్సిపల్ చైర్మన్, వైస్ చైర్మన్ రాజీనామా

మంచిర్యాల, జనవరి 10 (ఆంధ్రజ్యోతి): జిల్లాలోని మున్సిపాలిటీలలో అవిశ్వాస రాజకీయాలు నడుస్తున్నాయి. ఆయా మున్సిపాలిటీలలో అవిశ్వాసంపై సమావేశం ఏర్పాటు చేయాలని కాంగ్రెస్ కౌన్సిలర్లు కలెక్టర్ సంతోష్‌కు నోటీసు అందజేశారు. అవిశ్వాస సమావేశాలు ఏర్పాటు చేసేందుకు మున్సిపాలిటీలకు కలెక్టర్ గడువు విధించారు. ఈ నెల 11న మంచిర్యాల మున్సిపల్ కార్యాలయంలో అవిశ్వాస సమావేశం ఏర్పాటు చేస్తుండగా, నస్పూర్, బెల్లంపల్లి మున్సిపాలిటీల్లో 12వ తేదీన జరుపనున్నారు.

మున్సిపాలిటీల హస్తగతమే లక్ష్యం

2019 డిసెంబరులో మున్సిపల్ ఎన్నికలు జరుగగా మందమర్రి మినహా మిగతా ఆరు మున్సిపాలిటీలను అప్పుడు అధికారంలో ఉన్న బీఆర్ఎస్ కైవసం చేసుకుంది. మెజార్టీ స్థానాలను బీఆర్ఎస్ అభ్యర్థులు గెలుచుకోవడంతో కాంగ్రెస్ సభ్యులు ప్రతిపక్ష పాత్ర పోషించారు. కొన్ని చోట్ల బీఆర్ఎస్ క్లీన్ స్వీప్ చేయగా, ప్రతిపక్ష హోదా మరే ఇతర పార్టీకి దక్కకుండా పోయింది. శాసనసభ్యుల పదవీకాలం ముగియడం, రాష్ట్రంలో ఎన్నికలు జరిగి కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి రావడంతో పరిస్థితులు ఒక్కసారిగా తారుమారయ్యాయి.

కాంగ్రెస్ ఎమ్మెల్యేలు గెలవడంతో

అసెంబ్లీ ఎన్నికల్లో జిల్లాలోని మంచిర్యాల, చెన్నూరు, బెల్లంపల్లి నియోజకవర్గాల్లో కాంగ్రెస్ అభ్యర్థులు గెలుపొందారు. దీంతో మున్సిపల్ పాలకవర్గాల్లో మార్పులు చోటు చేసుకుంటున్నాయి. మున్సిపాలిటీ పాలక వర్గాలను హస్త గతం చేసుకోవ డమే లక్ష్యంగా కాంగ్రెస్ పావులు కదుపుతోంది. మున్సిపాలిటీల ఎన్నికలకు మరో ఏడాది సమయం మిగిలి ఉండగానే చైర్మన్, వైస్ చైర్మన్ పదవులు త్యాగం చేయాల్సిన పరిస్థితులు నెలకొన్నాయి. మంచిర్యాల, నస్పూర్, బెల్లంపల్లి, లక్సెట్టిపేటలో ఇప్ప టికే అవిశ్వాసం కోసం నోటీసులు అందజేయగా చెన్నూరు, క్యాతనపల్లి మున్సిపాలిటీల్లో ప్రస్తుతం బీఆర్ఎస్ చైర్మన్, వైస్ చైర్మన్లే ఉన్నారు. చెన్నూరు ఎమ్మెల్యేగా గడ్డం వివేకానంద్ గెలిచిన తరువాత కాంగ్రెస్‌లో బీఆర్ఎస్ నాయకులను చేర్చుకోనని ప్రకటించారు. ఈ క్రమంలో ఆ నియోజక వర్గంలోని చెన్నూరు, క్యాతనపల్లి మున్సి పాలిటీల్లో పాలక వర్గాల మార్పుల కోసం ఎలాంటి చర్యలు చేపట్టలేదు.

మంచిర్యాలలో ముందస్తు రాజీనామాలు

మంచిర్యాల మున్సిపాలిటీలో విపత్కర పరిణామాలు చోటు చేసుకున్నాయి. కాంగ్రెస్ సభ్యుల సంఖ్య ఎక్కువగా ఉండటంతో ఇదివరకే చైర్మ న్, వైస్ చైర్మన్లపై అవిశ్వాసం కోసం కలెక్టర్‌కు నోటీసు అంద జేశారు. అవిశ్వాసానికి సంబంధించి ఈ నెల 11న తీర్మాన సమావేశం ఏర్పాటు చేయనున్నారు. సమా వేశంలో తాము పదవి కోల్పోతామనే భావనతో చైర్మ న్, వైస్ చైర్మన్‌లు ముందస్తు రాజీనామాలకు పాల్ప డ్డారు. ఈ నెల 9న వైస్ చైర్మన్ గాజుల ముకేష్‌గౌడ్ పదవికి రాజీనామా చేస్తూ, సంబంధిత లేఖను కలె క్టర్‌కు అందజేశారు. ఆయన బాటలోనే నడిచిన చైర్మన్ పెంట రాజయ్య కూడా బుధవారం పదవికి రాజీనామా చేశారు.

బలాబలాలు ఇలా...

మంచిర్యాల మున్సిపాలిటీలో 36 వార్డులు ఉండగా, బీఆర్ఎస్ నుంచి కాంగ్రెస్‌లో చేరిన వారితో మొత్తం సభ్యు ల సంఖ్య 26 కు చేరింది. అవిశ్వాసం పె ట్టేందుకు కౌన్సిల్‌లో సగం కంటే ఎక్కువగా సభ్యులు ఉండాలనే నిబంధన ఉంది. సంఖ్యాబలం ఉండటంతో కాంగ్రెస్ చైర్మన్‌పై అవిశ్వాసం పెట్టేందుకు అవసరమైన చర్యలు తీసుకోవాలంటూ 26 మంది కాంగ్రెస్ కౌన్సిలర్లు గత నెల 15న కలెక్టర్‌ను కలిసి అవిశ్వాసం కోసం సమావేశం ఏర్పాటు చేయాలని నోటీసు అందజేశారు. దీంతో కలెక్టర్ కౌన్సిల్ సభ్యుల సమావేశం ఏర్పాటు చేసి, మెజార్టీ సభ్యుల నిర్ణయం మేరకు పాలక వర్గాన్ని ప్రకటించాలని తేదీ నిర్ణయించారు. నస్పూర్, బెల్లంపల్లి, లక్సెట్టిపేట మున్సి పాలిటీల్లో కూడా అవిశ్వాసం పెట్టినందున అక్కడి నాయకులు తమ పదవులకు రాజీనామాలు చేసే అవకాశాలు కనిపిస్తున్నాయి.

క్యాంపునకు తరలిన కౌన్సిలర్లు...

వరుసగా ఈ నెల 11, 12 తేదీల్లో మంచిర్యాల, నస్పూర్, బెల్లంపల్లి మున్సిపాలిటీల బల నిరూపణ సమావేశాలు ఉండటంతో ముందు జాగ్రత్త చర్యల్లో భాగంగా ఆయా మున్సిపాలిటీల కాంగ్రెస్ కౌన్సిలర్లను క్యాంపులకు తరలించారు. మంచిర్యాల, నస్పూర్ మున్సిపాలిటీల కౌన్సిలర్లు ఎమ్మెల్యే ప్రేంసాగర్‌రావు ఆదేశాలతో రెండు రోజుల క్రితం హైద్రాబాద్‌లోని ఓ రిసార్ట్‌కు ప్రత్యేక బస్సుల్లో తరలివెళ్లారు. బెల్లంపల్లి మున్సిపల్ కౌన్సిలర్లు సైతం క్యాంపునకు వెళ్లగా, 11న మంచిర్యాల మున్సిపాలిటీలో బలం నిరూపించుకోవలసి ఉండటంతో అక్కడి కౌన్సిలర్లంతా క్యాంపు నుంచి నేరుగా అదే రోజు ఉదయం సమావేశానికి హాజరకానున్నారు.

ఆంధ్రజ్యోతి-ఏబీఎన్ ముత్యాల ముగ్గుల పోటీ రాష్ట్రస్థాయి విజేత మందమర్రి వాసి



గెలుపొందిన హేమలత

మందమర్రి టౌన్, జనవరి 10: 'ఆంధ్రజ్యోతి-ఏబీఎన్ ఆధ్వర్యంలో కెనరా బ్యాంక్ ముత్యాల ముగ్గుల పోటీలు... పవర్డ్ బై ఎయిమ్స్ విద్యా సంస్థలు... బెంగుళూర్ రియల్ పార్టనర్ స్వర్గసీమ సుకేతన" ఆధ్వర్యంలో హైదరాబాద్‌లో నిర్వహించిన ముత్యాల ముగ్గుల పోటీల్లో మందమర్రికి చెందిన హేమలత రాష్ట్రస్థాయిలో ప్రథమ బహుమతి సాధించింది. ఈ నెల 6న మందమర్రి సింగరేణి మహిళా డిగ్రీ కళాశాల, పీజీ కళాశాలలో నిర్వ హించిన జిల్లాస్థాయి పోటీల్లో హేమలత విజేతగా నిలిచింది. బుధవారం రాష్ట్రస్థాయిలో నిర్వహించిన ముగ్గుల పోటీల్లో మొదటి స్థానం సాధించి రూ. 30 వేలు నగదు అందుకొంది. ఆమె నివాసం ఉంటున్న మందమర్రి మొదటి జోన్‌లో కుటుంబ సభ్యులు హర్షం వ్యక్తం చేశారు. ఆంధ్రజ్యోతి-ఏబీఎన్ సంక్రాంతి పండుగ సందర్భంగా ముగ్గుల పోటీలు నిర్వహించి తెలుగు సంస్కృతీ సంప్రదాయాలకు పెద్దపీట వేస్తున్నారని పేర్కొన్నారు.

ఎల్ఐసీలో వేతన సవరణ చేపట్టాలి



కార్యాలయం ఎదుట నిరసన తెలుపుతున్న ఉద్యోగులు

మంచిర్యాల కలెక్టరేట్, జనవరి 10: ఎల్ఐసీ సంస్థలో 17 నెలలుగా పెండింగ్‌లో ఉన్న వేతన సవరణ చేపట్టాలని ఇన్సూరెన్స్ ఐకాస నాయకులు డిమాండ్ చేశారు. దేశ వ్యాప్త సార్వత్రిక సమ్మెలో భాగంగా బుధవారం జిల్లా కేంద్రంలోని ఎల్ఐసీ కార్యాలయం ఎదుట బీమా ఉద్యోగులు విధులు బహిష్కరించి నిరసన వ్యక్తం చేశారు. నాయకులు మాట్లాడుతూ ప్రభుత్వ రంగ ఎల్ఐసీ సంస్థలో వేతన సవరణ ఆలస్యం చేయడం అన్యాయమన్నారు. బ్యాంకులు, ఇతర సంస్థల్లో వేతన సవరణ ఎప్పుడో పూర్తయ్యిందని, ఎల్ఐసీలో వెంటనే వేతన సవరణ చేపట్టాలన్నారు. ఎల్ఐసీ అధికారుల సంఘం నాయకులు సతీష్‌కుమార్,ప్రవీణ్, ఇన్సూరెన్స్ ఎంప్లాయిస్ నాయకులు రమేష్‌బాబు, చరణ్, రాందాసు, రాజేశం, జగదీష్, మనోజ్‌కుమార్, సురేష్, సమత్‌కుమార్, తిరుపతిరెడ్డి, పాల్గొన్నారు.

తలసేమియా వ్యాధిని ఆరోగ్యశ్రీలో చేర్చాలి



మంత్రితో మాట్లాడుతున్న ఎమ్మెల్యే

మందమర్రిటౌన్, జనవరి 10: తలసేమియా వ్యాధిని ఆరోగ్యశ్రీలో చేర్చాలని చెన్నూరు ఎమ్మెల్యే డాక్టర్ వివేక్ వెంకటస్వామి బుధవారం రాష్ట్ర ఆరోగ్య శాఖ మంత్రి దామోదర రాజనర్సింహాను హైద్రాబాద్ సచివాలయంలో కలిసి కోరారు. రాష్ట్రంతోపాటు ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాలో తలసేమియా వ్యాధితో బాధపడుతున్న వారి గురించి తెలియజేశారు. ఉమ్మడి జిల్లాలో 3 వేల మందికి పైగా వ్యాధిగ్రస్తులు ఉన్నారని, 15 రోజులకు ఒకసారి రక్తం ఎక్కించుకోవాల్సి ఉంటుందని తెలిపారు. నియోజకవర్గ పరిధిలో నిరుపేదలైన వ్యాధిగ్రస్తులు అధికంగా ఉన్నారన్నారు. ఆరోగ్యశ్రీలో చేర్చి వ్యాధిగ్రస్తులను ఆదుకోవాలని మంత్రికి విన్నవించారు.

ఎన్‌హెచ్ హైవే అలైన్‌మెంట్ మార్చాలి



ఆర్డీవోకు వినతి పత్రం ఇస్తున్న రైతులు

హాజీపూర్, జనవరి 10: గ్రీన్‌ఫీల్డ్ హైవే అలైన్‌మెంట్ మార్చాలని బుధవారం ముల్కల్ల రైతులు ఆర్డీవో రాములుకు వినతిపత్రం అందించారు. అధి కారులు రకరకాల సర్వేలు చేస్తూ ఇబ్బందులు పెడుతున్నారని, విలువైన వ్యవసాయ భూముల నుంచి రహదారి వెళ్తుండడంతో తమ భూములను కోల్పోవాల్సి వస్తుందన్నారు. తమకు ఎటువంటి సమాచారం ఇవ్వకుండా సర్వే చేస్తున్నారని తెలిపారు. గ్రీన్‌ఫీల్డ్ హైవేను పొలాల మీదుగా కాకుండా జాతీయ రహదారి వెంబడి విస్తరణ చేయాలని కోరారు. పాత అలైన్‌మెంట్ ప్రకారమే చేపట్టాలని విన్నవించారు.

బస్సు పునః ప్రారంభించాలి

వేమనపల్లి, జనవరి 10 : వేమనపల్లి మండలానికి బెల్లంపల్లి నుంచి వచ్చే ఆర్టీసీ బస్సును పునః ప్రారంభించాలని బుధవారం మండలానికి చెందిన ఓయూ జేఏసీ నాయకులు దుర్గం మల్లేష్, గణేష్‌లు ఆర్టీసీ డిపో మేనేజర్ రవీందర్‌కు వినతిపత్రం అందించారు. బస్సులు లేక ప్రజలు ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. వెంటనే మండలానికి బస్సులను నడిపించాలని కోరారు.

మహంకాళి ఆలయంలో చండీహోమం



చండీహోమంలో పాల్గొన్న భక్తులు

రామకృష్ణాపూర్, జనవరి 10: పట్టణంలోని ప్రసన్నాంజనేయ స్వామి, మహంకాళీ ఆలయంలో బుధవారం లక్ష్మీగణపతి రుద్ర సహిత చండీయాగ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఉదయం ప్రత్యేక పూజా కార్యక్రమాను ఆలయ ప్రధాన అర్చకులు అవదూత శర్మ నిర్వహించారు. అనంతరం వేద పండితులు ముస్తాయ్యల సంతోష్ శర్మ, వంశీ కృష్ణ శర్మ, సురేష్ శర్మ, అవధూత శర్మల ఆధ్వర్యంలో చండీహోమాన్ని నిర్వహించగా భక్తులు పెద్ద సంఖ్యలో హాజరయ్యారు. నిర్వాహకులు తిరుపతి గౌడ్, గోవిందుల రమేష్, నిమ్మల సాయిలు తెలిపారు.

గద్దర్‌కు నివాళులర్పించిన డిప్యూటీ సీఎం, ఎమ్మెల్యే



ఏసీసీ, జనవరి 10: ప్రజాగాయకుడు గద్దర్‌కు డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క, ఎమ్మెల్యే కొక్కిరాల ప్రేంసాగర్‌రావులు నివాళులర్పించారు. బుధవారం సికింద్రాబాద్‌లోని మహాబోధి విద్యాలయంలో ఉన్న గద్దర్ సమాధి వద్ద నివాళులర్పించిన అనంతరం కుటుంబ సభ్యులను పరామర్శించారు. వారు మాట్లాడుతూ తెలంగాణ ఉద్యమానికి ఊపరిలూది స్వరాష్ట్రం ఏర్పడ్డ అనంతరం ప్రజా తెలంగాణ సాకారం కావడానికి నిరంతరం పోరాడిన మహనీయుడు గద్దర్ అని కొనియాడారు. గద్దర్ కుటుంబానికి ప్రభుత్వం, కాంగ్రెస్ పార్టీ అన్ని విధాలుగా అండగా ఉంటుందన్నారు.

అంధుల జీవితాల్లో వెలుగులు నింపిన లూయిస్ బ్రెయిలీ



అంధులను సన్మానిస్తున్న కలెక్టర్ సంతోష్, మాతాశిశు ఆసుపత్రిని పరిశీలిస్తున్న వైద్య ఆరోగ్య శాఖ కమిషనర్ కర్ణన్

మంచిర్యాల కలెక్టరేట్, జనవరి 10: అంధుల కోసం లిపిని సృష్టించి వారి జీవితంలో వెలుగులు నింపిన మహనీయుడు లూయిస్ బ్రెయిలీ అని కలెక్టర్ బదావత్ సంతోష్ పేర్కొన్నారు. బుధవారం కలెక్టరేట్‌లో లూయిస్ బ్రెయిలీ జయంతి వేడుకలను నిర్వహించారు. సంక్షేమాధికారి చిన్నయ్య, డీఆర్‌డీవో శేషాద్రితో కలిసి జ్యోతి ప్రజ్వలన చేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు. కలెక్టర్ మాట్లాడుతూ అంధులు సామాన్యులతో సమానంగా అన్ని రంగాల్లో ముందుండేలా ఆలోచించి లూయిస్ బ్రెయిలీ ఆరు చుక్కలతో కూడిన లిపిని తయారు చేశారన్నారు. అనంతరం క్యాలెండర్‌ను ఆవిష్కరించి కేక్ కట్ చేసి అంధులను సన్మానించారు.

మెరుగైన వైద్య సేవలందించాలి

జిల్లాలోని కాలేజీ రోడ్డులో కొనసాగుతున్న మాతా శిశు ఆసుపత్రి భవన నిర్మాణ పనులను వేగవంతం చేసి మెరుగైన వైద్య సేవలందించాలని రాష్ట్ర వైద్య ఆరోగ్య శాఖ కమిషనర్ ఆర్‌వీ కర్ణన్ పేర్కొన్నారు. బుధవారం కాలేజీ రోడ్డులోని మాతా శిశు కేంద్రాన్ని కలెక్టర్ బదావత్ సంతోష్, అదనపు కలెక్టర్ రాహుల్, సివిల్ సర్జన్ రెసిడెంట్ వైద్యాధికారి భీష్మ, జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి సుబ్బారాయుడుతో కలిసి సందర్శించారు. కర్ణన్ మాట్లాడుతూ మాతా శిశు ఆసుపత్రి ద్వారా విశిష్ట సేవలు అందిస్తుందని తెలిపారు. వైద్య సేవలు మరింత విస్తృతం చేసేందుకు రూ.205 కోట్లతో మాతా శిశు ఆసుపత్రి నూతన భవన సముదాయాన్ని నిర్మిస్తున్నామని తెలిపారు.

ఓటరు దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించాలి

మంచిర్యాల కలెక్టరేట్, జనవరి 10: ఈ నెల 25న 14వ జాతీయ ఓటరు దినోత్సవాన్ని పురస్కరించుకుని జిల్లాలో ఓటరు దినోత్సవ వేడుకలను అన్ని శాఖల సమన్వయంతో ఘనంగా జరుపుకోవాలని కలెక్టర్ బదావత్ సంతోష్ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఓటు లాంటిది ఇంకొకటి లేదు- నేను కచ్చితంగా ఓటు వేస్తాను అనే నినాదంతో అర్హత గల ప్రతీ ఒక్కరు ఓటు హక్కు వినియోగించుకునే విధంగా వివిధ రకాల కార్యక్రమాల ద్వారా ప్రజలను చైతన్య పర్చాలని తెలిపారు. పోస్టర్లు, బ్యానర్లు, ప్రసార మాధ్యమాల ద్వారా అధికారులు విస్తృత ప్రచారం నిర్వహించాలని సూచించారు. ఈ నెల 15న నిర్వహించనున్న ఓటరు దినోత్సవాన్ని విజయవంతం చేసేందుకు అందరు కలిసి రావాలని కోరారు.

నష్టపరిహారం పొందేందుకు దరఖాస్తు చేసుకోవాలి

మంచిర్యాల కలెక్టరేట్, జనవరి 10: కార్మిక శాఖ పరిధిలో నిర్వహిస్తున్న ఈ శ్రమ్ పోర్టల్‌లో నమోదైన అసంఘటిత రంగ కార్మికులు నష్టపరిహారం పొందేందుకు ఈ నెల 24వ తేదీలోగా దరఖాస్తు చేసుకోవాలని జిల్లా కార్మిక శాఖ సహాయ కమిషనర్ వినీత బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. ప్రమాదంలో మృతిచెందిన వారి కుటుంబాలకు రూ.2 లక్షలు, అంగవైకల్యం కలిగితే రూ. 2 లక్షలు, పాక్షిక అంగవైకల్యం కలిగితే రూ. లక్ష అందిస్తారన్నారు. మార్చి 31, 2022 కంటే ముందు ఈ శ్రమ్ పోర్టల్‌లో నమోదు చేసుకున్న వారు నష్టపరిహారం పొందేందుకు అర్హులు. ఈ నెల 24లోగా సమీకృత జిల్లా కార్యాలయాల భవన సముదాయంలోని 2వ అంతస్తులో ఎస్ 8లో గల కార్మిక శాఖ సహాయ కమిషనర్ కార్యాలయంలో ధ్రువపత్రాలు జతపర్చి అందజేయాలన్నారు.

మార్కెట్ యార్డులోనే టోకెన్‌ల పంపిణీ

చెన్నూరు, జనవరి 10: చెన్నూరు జాతీయ రహదారి పక్కన గల మార్కెట్ యార్డులో పత్తి వాహనాలు తీసుకుని వచ్చి టోకెన్‌లు పొందాలని సీసీఐ సీపీవో ఉదయ్‌షా, మార్కెట్ కమిటీ కార్యదర్శి రామాంజనేయులు సూచించారు. బుధవారం మార్కెట్ కమిటీ కార్యాలయంలో జిన్నింగు మిల్లు యాజమానులు, ట్రేడర్స్‌తో సమావేశం నిర్వహించారు. వారు మాట్లాడుతూ ఈ నెల 17 నుంచి పత్తి కొనుగోళ్లు ప్రారంభిస్తామని తెలిపారు. పత్తిని విక్రయించే రైతులు వాహనాల్లో 40 క్వింటాళ్లు మించకుండా తీసుకుని రావాలని సూచించారు. రైతులు యార్డులో తేమ పరిశీలించిన తర్వాత టోకెన్‌లు పొంది మిల్లులకు తీసుకువెళ్లాలన్నారు.

క్రీడలతో యువతలో స్నేహభావం పెంపు



క్రికెట్ టోర్నమెంట్‌ను ప్రారంభిస్తున్న బెటాలియన్ కమాండెంట్

శ్రీరాంపూర్, జనవరి 10: క్రీడలతో యువతలో స్నేహభావం పెరుగుతుందని ఎస్ఐ కె.రాజేశ్ అన్నారు. రిటైర్డ్ కార్మికుడు వంటకాల మల్లారెడ్డి స్మారకార్థం కృష్ణకాలనీ శాంతి స్టేడియంలో నిర్వహిస్తున్న క్రికెట్ పోటీలను బుధవారం ఆయన ప్రారంభించారు. అందరికీ శారీరక, మానసిక ఉల్లాసం అవసరమని, దానికి క్రీడలు ఒక్కటే మార్గమన్నారు. టోర్నమెంట్‌కు జిల్లావ్యాప్తంగా 30 జట్లు హాజరు కానుండగా, మూడు రోజులపాటు పోటీలుంటాయని నిర్వాహకులు తెలిపారు. ప్రథమ రూ.15 వేలు, ద్వితీయ రూ.8,500లు అందిస్తామని వివరించారు. కౌన్సిలర్ అగల్‌డ్యూటీ రాజు, నాయకులు కొంతం భార్గవ్, సిరికొండ రాజు, కొండ వెంకటేష్, వంటకాల వేణు పాల్గొన్నారు.

హాజీపూర్: రాసమల్ల అశోక్‌గౌడ్ జ్ఞాపకార్థం అతని మిత్రబృందం ఎంపీటీసీ ఒడ్డె బాలరాజు, డీజే శేఖర్, ఉపసర్పంచు ముడిమడుగుల శ్రీనివాసరావు, సత్యం ఆధ్వర్యంలో మండల స్థాయి క్రికెట్ టోర్నమెంట్ నిర్వహించారు. టోర్నమెంట్‌ను గుడిపేట 13వ పోలీసు బెటాలియన్ కమాండెంట్ సయ్యద్ జమీల్ భాష, అడిషనల్ కమాండెంట్ రఘునాథ్ చౌహాన్‌లు ప్రారంభించారు. కమాండెంట్ మాటాడుతూ గెలుపోటములు సహజమని, ఓడిపోయినా నిరుత్సాహ పడకుండా గెలుపు కోసం కృషి చేయాలన్నారు. క్రికెట్ టోర్నమెంట్ నాలుగు రోజుల పాటు జరుగుతాయని నిర్వాహకులు తెలిపారు. 13 జట్లు పాల్గొంటున్నాయని, మొదటి బహుమతి రూ.20 వేలు, ద్వితీయ రూ.10 వేలు అందజేస్తారన్నారు. సర్పంచు లగిశెట్టి లక్ష్మీరాజయ్య, బేర పద్మపోచయ్య, రాసమల్ల శ్రీనివాస్ గౌడ్, ఒడ్డె శ్రీనివాస్, లచ్చన్న, బాపన్న, మల్లేష్, సత్తయ్యరవి పాల్గొన్నారు.

క్రికెట్ పోటీలకు జట్ల ఎంపిక

మందమర్రిరూరల్: మండలంలోని సారంగపల్లి గ్రామంలో జరిగే గ్రామీణ స్థాయి క్రికెట్ టోర్నమెంట్ పోటీలకు బుధవారం జట్లను ఎంపిక చేశారు. నిర్వాహకులు చిప్పకుర్తి శ్రీనివాస్ మాట్లాడుతూ మొత్తం 14 జట్లు పాల్గొంటున్నాయని తెలిపారు. ఈ నెల 12న ప్రారంభ పోటీ ఆదిల్‌పేట, గుడిపెల్లి జట్లకు ఉంటుందని తెలిపారు. గ్రామీణ క్రీడాకారులను ప్రోత్సహించడానికి ఈ పోటీలు నిర్వహిస్తున్నామని ఆయన తెలిపారు.

హిట్‌రన్ చట్టాన్ని ఎత్తివేయాలని ఆందోళన



కొండాపూర్‌యాప వద్ద దీక్షలు చేస్తున్న డ్రైవర్లు

కాసిపేట, జనవరి 10: కేంద్ర ప్రభుత్వం తెచ్చిన హిట్ రన్ చట్టాన్ని వెంటనే ఎత్తివేయాలని బుధవారం మండల లారీ డ్రైవర్ల సంఘం నాయకులు నిరసన దీక్షలు చేపట్టారు. సంఘం మండల ప్రధాన కార్యదర్శి నాయిని కిరణ్ మాట్లాడుతూ చాలీచాలని వేతనాలతో కాలం వెళ్లదీస్తున్న డ్రైవర్లపై కేంద్రం తెచ్చిన నల్లచట్టాన్ని వెంటనే ఎత్తివేయాలని, ఏడాదిలో లక్ష రూపాయల ఆదాయం సంపాదించ లేని డ్రైవర్లపై ఇలాంటి చట్టాన్ని తేవడంతో ఉపాధిని దెబ్బ తీస్తుందన్నారు. లారీ డ్రైవర్ ప్రమాదం చేసినప్పుడు పారిపోతే రూ.7 లక్షల జరిమానా, పదేండ్ల జైలు శిక్ష విధించడం సరైంది కాదన్నారు. వెంటనే ఈ చట్టాన్ని రద్దు చేయాలని కోరారు. నాయకులు ఇస్మాయిల్, నన్ను, షేర్ ఖాన్, పోశం, భీమయ్య, వేణు, రాజమౌళి, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

సంఘం బలోపేతానికి అందరూ కృషి చేయాలి

నస్పూర్, జనవరి 10 : మున్నూరు కాపు కులస్తులు ఐక్యత, రాజకీయంగా ఎదుగుతూ సంఘం బలోపేతానికి కృషి చేయాలని సంఘం రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ బొరిగాం రాజారాం అన్నారు. నస్పూర్ ప్రెస్ క్లబ్‌లో బుధవారం మున్నూరు కాపు సంఘ క్యాలెండర్-2024ను ఆవిష్కరించారు. ఆయన మాట్లాడుతూ రాజకీయ చైతన్యం ద్వారానే సామాజికంగా, ఆర్థికంగా అభివృద్ధి సాధిస్తామన్నారు. స్థానిక సంస్థల ఎన్నికల్లో మున్నూరు కాపులు పోటీలో నిలిచి విజయం సాధించే విధంగా అందరూ కృషి చేయాలని పిలుపునిచ్చారు. జిల్లా యూత్ అధ్యక్షుడు సీపతి సురేష్, నాయకులు పడాల రవీందర్, పానుగంటి సత్తయ్య, సకినాల నర్సయ్య, రామకృష్ణ, పాల్గొన్నారు.

ప్రమాదాల నివారణకు కృషి చేయాలి

తాండూర్, జనవరి 10: ప్రమాదాల నివారణకు పాఠశాలల బస్సుల డ్రైవర్లు, సహాయకులు కృషి చేయాలని ఎస్ఐ రాజశేఖర్ తెలిపారు. బుధవారం విద్యాభారతి పాఠశాలలో బస్సు డ్రైవర్లు, సహాయకులకు ప్రమాదాల నివారణపై అవగాహన కల్పించారు. జాతీయ రహదారిపై జాగ్రత్తగా డ్రైవింగ్ చేయాలని, రాంగ్‌రూట్, ర్యాష్ డ్రైవింగ్ చేయవద్దన్నారు. లైసెన్స్‌లు పరిశీలించారు. పాఠశాల డైరెక్టర్ శరత్‌కుమార్, పాల్గొన్నారు.

చైనామాంజ విక్రయిస్తే కఠిన చర్యలు



చెన్నూరు, కాసిపేటలో తనిఖీలు చేస్తున్న అటవీ శాఖ అధికారులు

చెన్నూరు, జనవరి 10 : ప్రమాదకరమైన చైనామాంజ విక్రయిస్తే కఠినచర్యలు తీసుకుంటామని ఎఫ్ఆర్‌వో శివకుమార్ అన్నారు. బుధవారం కిరాణ, పతంగుల దుకాణాలను తనిఖీ చేశారు. ఆయన మాట్లాడుతూ చైనామాంజాతో మనుషులతోపాటు పక్షులకు ప్రమాదం పొంచి ఉందన్నారు. చైనామాంజను విక్రయించవద్దన్నారు. ఎఫ్ఎస్‌వోలు బాలకృష్ణ,వెంకట్, జ్యోతి,రవీందర్‌లు పాల్గొన్నారు.

కాసిపేట: దుకాణదారులు చైనామాంజ అమ్మితే కఠిన చర్యలు తీసుకుంటామని ముత్యంపల్లి డిప్యూటీ రేంజ్ అటవీ అధికారి ప్రవీణ్‌నాయక్ తెలిపారు. కాసిపేట, ముత్యంపల్లి, కొండాపూర్‌లలోని గాలిపటాల దుకాణాల్లో తనిఖీలు చేశారు. ఆయన మాట్లాడుతూ నిషేధిత చైనా మాంజ ప్రమాదకరమని తెలిపారు. మాంజాదారం తగిలి గతేడాది బాలుడు మృతి చెందాడని తెలిపారు. బీట్ ఆఫీసర్లు కుమారస్వామి, సురేష్ తదితరులు పాల్గొన్నారు.

దండేపల్లి: చైనామాంజా విక్రయిస్తే కఠిన చర్యలు తప్పవని తాళ్ళపేట అటవీ రేంజ్ అధికారి సుష్మారావు హెచ్చరించారు. మ్యాదరిపేట, తాళ్ళపేట, ముత్యంపేట తదితర ప్రధాన సెంటర్‌లో కిరణాల షాప్‌లను తనిఖీలు చేపట్టారు. తాళ్లపేట ఉన్నత పాఠశాల, దండేపల్లి కస్తూర్బా విద్యాలయంలో చైనా మాంజాపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. విద్యార్థులకు డ్రాయింగ్ పోటీలు నిర్వహించి బహుమతులు ప్రదానం చేశారు. డిప్యూటీ ఆర్‌వో పోచమల్లు, ప్రమోద్‌కుమార్, ఎఫ్ఎస్‌వోలు హన్మంతరావు, ఎఫ్‌బీవోలు సాగర్, అనిల్, అనిత ఉన్నారు.

బెల్లంపల్లి: నిషేధించిన చైనామాంజ విక్రయిస్తే కఠిన చర్యలు తప్పవని అటవీ బీట్ అధికారి శంకరయ్య, రవిలు హెచ్చరించారు. బజార్ ఏరియాలో ఏర్పాటు చేసిన మాంజా దుకాణాలను తనిఖీ చేశారు. మాంజదారాలను పరిశీలించారు. చైనామాంజ అమ్మవద్దని సూచించారు.